# ఉపగ్రహం-1

**సాయంకాలం నాలుగ్గంటలకి పనిమనిషి వచ్చింది. లేచి వెళ్ళి దానికి అంట్లు పడేసి స్టవ్ వెలిగించాను.**

ఓపక్క కాఫీకి నీళ్ళూ మరోపక్క పాలూ పెట్టాను. పొద్దున్న నానేసిన పెసరపప్పు మరోసారి కడిగి, ఒడ్చి రుబ్బురోలు ముందు కూర్చున్నాను. పీటమీద శాస్త్రయుక్తంగా కూర్చుని పప్పురుబ్బుతూంటే నాకే నవ్వొచ్చింది. కొద్దిరోజుల క్రితం వరకూ కాలేజీలో కుర్చీలో జీవితం గడిపినదాన్ని హఠాత్తుగా తెరమార్చి మరో దృశ్యాన్ని చూస్తున్నట్లనిపించింది. ఇదివరకు అప్పుడప్పుడు అమ్మ సాయం చెయ్యమని అడిగితే కాస్సేపు రుబ్బి 'అబ్బ, చేతులు పడిపోతున్నాయమ్మా' అంటూ లేచిపోయి పుస్తకం పట్టుకుని పడక్కుర్చీలో వాలిపోయిన రోజులు గుర్తుకొచ్చాయి. అవన్నీ చిన్నపిల్ల చేష్టల్లా అనిపించి ఉత్సాహంతో చకచకా పప్పు రుబ్బేశాను. మరుగుతున్న నీళ్ళలో కాఫీపొడి వేసి దింపాను. కాగిన పాలమీద మూతపెట్టాను. కూరల బుట్ట తెచ్చుకొని డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను. పెసరట్ల కోసం అల్లం, పచ్చి మిరపకాయలూ తీసి సన్నగా తరిగి ప్లేటులో పెట్టాను. బంగాళదుంపలు తీసి కూరకి ముక్కలు తరిగాను. పనిమనిషి ఈ లోపల పని పూర్తిచేసి 'వెడుతున్నానమ్మా' అంది. దాన్ని పంపించి రాత్రికి వంట మొదలు పెట్టాను. అయిదున్నర అయేసరికి కూర, అన్నం, చారు అయిపోయాయి. అప్పుడు పెసరట్లు వేశాను - ఆయన వచ్చేసరికి వేడివేడిగా ఉంటాయని. తరవాత మొహం రుద్దుకొని ముస్తాబయాను. రోజూలాగ తిలకంతో దోసగింజ బొట్టు కాకుండా కుంకుమతో గుండ్రంగా బొట్టుపెట్టాను. కట్టుకున్న ఎర్రబోర్డరు బెంగాలీ చీరకీ ఆ బొట్టుకీ కలిసి నా మొహానికొక వింత అందాన్ని తెచ్చినట్లు తోచింది.

ఆయన ఆఫీసునుంచి వస్తూనే వరండాలో పడక్కుర్చీలో వాలిపోయి 'కాస్త తిండానికేమన్నా ఉంటే చూడ్డూ' అన్నారు. 'ఏం చేశానో చూద్దురుగాని రండి' అన్నాను కన్ను చికిలిస్తూ. చేతులు కడుక్కుని వచ్చి బల్ల దగ్గర కూర్చున్నారు. నేను పెసరట్టు తీసుకొచ్చి ఆయన

ముందు పెట్టాను. కాఫీ కలిపి రెండు కప్పులతో తిరిగి వచ్చేసరికి ఆయన తినటం పూర్తయిపోయింది. నేను వచ్చే వరకూ ఆగలేదన్న నిరుత్సాహం క్షణంసేపు కలిగింది. అంతలోనే 'పాపం అలిసిపోయి ఆకలి మీద ఉన్నారు కాబోలు' అని నన్ను నేను సమాధానపరుచుకుని ఉత్సాహంగా అడిగాను 'ఎలా ఉన్నాయి?' అని.

'భలే ఆకలేసింది' అన్నారు. అంతే, నేను మరింత నిరుత్సాహపడి కాఫీ తాగుతూ కూర్చున్నాను.

'ఇవాళ్టి పేపరేదీ?' అన్నారు. కాఫీ తాగి, తీసుకొచ్చి ఇచ్చాను. వరండాలో పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదవటం మొదలుపెట్టారు. నేను ప్లేట్లూ కప్పులూ తీసేసి బల్లతుడిచేసి, చేసే మరో పనేమీలేక ఇంకో కుర్చీ తెచ్చుకుని ఆయన పక్కనే కూర్చున్నాను. ఆయన పేపరు ధోరణిలో ఆయనున్నారు. నేను ఏంతోచక ఆయన వైపే చూస్తూ కూర్చున్నాను. అలా చూస్తూంటే 'ఈయనే కదా నా సర్వస్వం' అనిపించి, ఆయన ఒత్తైన జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ ఏవేవో మాట్లాడాలనిపించింది. 'ఏమండీ' అన్నాను. వినిపించనట్టుంది. మొహం ఇటు తిప్పనైనాలేదు. నేను మళ్ళీ మౌనంగా మరికొంతసేపు కూర్చుని చివరికి లేచి వెళ్ళి తెలుగు పత్రిక ఒకటి తెచ్చుకుని కేవలం మనస్సుని మరిపించటానికి చదువుతూ కూర్చున్నాను.

ఆయన పేపరు చదవటం పూర్తిచేసి మడిచి పెడుతూంటే "అమ్మయ్య" అనుకుని ఆయన వైపు ఆశగా చూశాను. ఆయన అదేం పట్టించుకోనట్లు వెళ్ళి ఆఫీసు కాగితాలూ పుస్తకాలూ తెచ్చుకుని వాటిలో మునిగిపోయారు. ఎనిమిది అయేవరకూ అలాగే ఉండిపోయాము.

'భోంచేద్దామా?' అన్నారు వాచీ చూసుకుని. 'ఊఁ' అని నీరసంగా లేచి వెళ్ళి అన్నీ టేబుల్ మీద సర్దాను. భోంచేస్తూ వాళ్ళ ఆఫీసులో జరిగిన విశేషాలు చెప్పారు. ఎంతో శ్రద్ధగా విన్నాను మధ్య మధ్య ప్రశ్నలడుగుతూ. భోజనం అయిపోయాక ఆయన వక్కపొడి వేసుకుంటున్నప్పుడయినా నా వంటకాల గురించి రెండు ముక్కలు ఏమన్నా అంటారేమోనని ఎదురు చూశాను. ఎన్నాళ్ళనుంచో కాపురం చేస్తున్నవాడిలా నేను వంట చేయటం ఆయన తృప్తిగా భోంచేసి వక్కపొడి వేసుకోవటం అతి సామాన్యమయిన విషయంలా ఆయన నిర్లక్ష్యంగా ఉండటం చూసి నాకు ఎక్కడలేని అసంతృప్తి కలిగింది. నేను కొత్త చీర కట్టుకున్నట్లుగాని, గుండ్రని కుంకుమ బొట్టువల్ల నా మొహంలో వింత అందం వచ్చినట్టుగాని ఆయన గమనించినట్టే లేదు. అక్కడికీ మనసులో మథనపడటం ఇష్టం లేక అడిగేశాను. 'ఏమండీ, చారు బాగా కుదిరిందా, రుచిగా ఘాటుగా ఉందా?' అని. 'లేకపోతే చెప్పేవాణ్ణిగా'

అన్నారు. చన్నీళ్లు మీదబోసినట్లయింది నాకు. 'ఏం బావుంటే ఆ మాట పైకి అనకూడదా' అన్నాను.

'నాకు భట్రాజు పొగడ్తలు చేతకావు సుమీ' అంటూ పడగ్గదిలోకి దారితీశారు.

వంటిల్లు సర్ది, పాలు తోడుపెట్టి, తలుపులు వేసివచ్చి, కొత్తచీర విప్పి ఉతికిన వాయిలు చీర కట్టుకుని మంచం మీద వాలాను. అప్పటికే వచ్చి పడుకున్న ఆయన నా భుజాల చుట్టూ చెయ్యి వేశారు. ఆ ఆప్యాయత కోసమే అలమటించిపోతున్నట్లు అమాంతం ఆయన్ని పెనవేసుకుపోయాను.

'మామిడి చెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటీ' అన్న చరణం గుర్తుకొచ్చి నా ఒళ్లు పులకరించింది. మా ఆవేశం చల్లారటానికి అయిదు నిముషాలు పట్టలేదు. ఆయన అటు తిరిగి పడుకున్నారు. అదే నాకు నచ్చదు. అక్కడికీ ఉండబట్టలేక ఆయన వీపునే అంటిపెట్టుకుని పడుకోబోయాను.

'చచ్చేట్టు నిద్దరొస్తోంది' అన్నారు మత్తుగా. తనను విసిగించవద్దన్నట్లు. ఏదో నిద్రమాత్ర పుచ్చుకున్నట్లు క్షణంలో పడుకున్నారు. నాకు నిద్రరావటంలేదు. పొద్దున్న తొమ్మిదిన్నరకి ఆయన ఆఫీసుకి వెళ్ళిన దగ్గర నుంచి సాయంకాలం ఆరు గంటల వరకూ ఒంటరిగా గడిపిన నాకు ఆయన ఎప్పుడొస్తారా ఎప్పుడు కబుర్లు చెప్పుకుంటూ గడుపుదామా అనే తహతహ కలుగుతుంది. ఆయన వస్తూనే పేపరూ పుస్తకాలూ పుచ్చుకుని కూర్చుంటారు. 'పోనీ, షికారుగా అలా వెళ్లొద్దామా' అంటే 'అబ్బ -కాళ్ళు పీక్కుపోతున్నాయి. ఇవ్వాళ ఆఫీసులో పొద్దుట్నుంచి నిలబడే ఉన్నాను' అంటూ బాధగా మొహం పెడతారు. పెళ్ళయిన కొత్తకదా, నాకున్న తహతహ ఆయన కెందుకుండదు? ఆఫీసు నుంచి వస్తూ నన్ను చూడగానే ఆప్యాయంగా ఎందుకు దగ్గరికితీసుకోరు? ఆఫీసుకి వెళ్ళేటప్పుడూ అంతే. ఆఫీసుకి వెళ్ళిపోవాలన్న హడావిడే తప్ప నన్ను విడిచి వెడుతున్నానన్న భావంకాని, వెళ్ళేముందు నావైపొక్కసారి ప్రేమగా చూడనన్నా చూడాలనే భావంకాని ఆయన కింతవరకూ కలగ్గా చూడలేదు. ఆయనకి ఆఫీసు తప్ప మరే ధ్యాస లేదా? నన్నెందుకు పెళ్ళి చేసుకున్నట్లు? ఆయనే నా జీవితసర్వస్వం అనుకుంటున్నానే - ఆయన తప్ప నాకింక ఇప్పుడు జీవితంలో మరోఇష్టం కనిపించటం లేదు కదా - ఆయన కూడా అలా ఎందుకనుకోరు? నేను ఆయన జీవితంలో కేవలం మరొక అదనపు సౌఖ్యాన్ని మాత్రమేనా?

ఆలోచనతో అటూఇటూ పొర్లి చివరి కెలాగో పడుకున్నాను.

మర్నాడు మళ్ళీ అదే కార్యక్రమం. పొద్దున్న పాలవాడు బెల్ కొట్టడంతో ప్రారంభమయిన పని రాత్రి ఆయన అటు తిరిగి పడుకోవటంతో ఆఖరు.

ఆదివారం వచ్చేసరికి ఎక్కడలేని ఉత్సాహం ఆవరించింది నన్ను - రోజంతా ఇద్దరం కలిసి గడపొచ్చును కదా అని. పక్కమీద పొద్దెక్కేవరకూ దొర్లుదామని అనుకుంటూంటే పాలవాడొచ్చి బెల్ కొట్టాడు. తప్పదురా జీవుడా అనుకుంటూ వెళ్ళి పాలు పోయించుకుని స్టౌమీద పడేసి మళ్ళీ మంచంమీద వాలేనో లేదో పనిమనిషి హాజరు. నా రొటీను నాకు తప్పలేదు. ఆయన మాత్రం హాయిగా పడుకునే ఉన్నారు. చదువుకుంటున్న రోజుల్లో అమ్మ ఎన్నిసార్లు సుప్రభాతం చదివినా అలాగే పక్కమీద బద్దకాన్ని బుజ్జగిస్తూ పడుకోవటం గుర్తుకొచ్చి ప్రాణం గిజగిజలాడింది. ఆ సుఖం ఇప్పుడేది?

పదకొండింటికి భోజనాలయేసరికి ఆయన 'కోలీగ్' ఒకతను వచ్చాడు. ఇహ ఇద్దరూ బాతాఖానీ మొదలుపెట్టారు. నేను నిమ్మకాయ షర్బత్ చేసి పట్టుకెళ్ళి ఇచ్చి 'ఆవిణ్ణి కూడా తీసుకు రాకపోయారా' అన్నాను పలకరింపుగా.

'ఏదీ, ఎక్కడండీ, ఆదివారం కదా, పిల్లలకీ తనకీ తలంట్లూ, స్పెషల్ వంటా - హడావిడిలో ఉంది' అన్నాడు నవ్వుతూ.

'మీ భోజనాలింకా కాలేదా' అన్నాను.

'ఎక్కడండీ, పొద్దున్నే ఇడ్లీ చేసింది. ఇక ఒంటిగంటదాకా తిండి బాధ లేదు' అన్నాడు.

'మీకు తిండి బాధ లేకపోయినా ఆవిడకి వంటబాధ తప్పదు కదా' అని మనస్సులో అనుకుని మెల్లిగా తప్పించుకుని లోపలి కొచ్చేశాను. ఏదో పాతనవల తీసి పేజీలు తిరగెయ్యటం మొదలుపెట్టాను. ఓ గంటసేపటి వరకూ ఆ వచ్చినతను వెళ్లలేదు. వస్తూనే ఆవలిస్తూ ఆయన పడకేశారు.

మధ్యాహ్నం మూడు దాటిపోయింది లేచేసరికి. ఏదైనా సినిమాకి మేటనీకి వెడదామా అని పొద్దుట్నించీ అనుకుంటున్నదాన్ని ఆ ఆశకి అప్పుడే నీళ్ళొదులుకున్నాను. బజ్జీలూ కాఫీ చేసి స్టౌమీద బియ్యం పడేశాను.

బజ్జీలు తింటూంటే అన్నాను 'ఏమండీ, సాయంకాలం ఏదన్నా సినిమాకి పోదామా' అని. వెంటనే అదోరకంగా మొహంపెట్టారు. అయినా వెంటనే దిగజారిపోక,

'ప్లాజాలో మంచి పిక్చరొచ్చిందండీ, ఇంట్లో కూర్చుని ఏం చేస్తాం' అన్నాను.

'ఆఁ, ఇప్పుడు వెళితే టిక్కెట్లు దొరకవు - ప్రయాస తప్ప - హాయిగా కూర్చుని రేడియో విందాం' అన్నారు.

'ఛీ, వెధవ రేడియో. ఒక్క మంచి ప్రోగ్రాం రాదు' అన్నాను ఉడుకుమోత్తనంతో.

రెండు మూడు రోజులు యథావిధిగా నా వంట, ఆయన ఆఫీసు - నిత్యకార్యక్రమం

కొనసాగిపోయింది. రోజూ వంట అయిపోగానే ఆయన తిని వెళిపోతారు. ఉన్న రెండు మూడు గదుల్లోనూ ఇటూ అటూ కాలుకాలిన పిల్లిలా తిరగడం, రేడియో మీద, అలమారు, డ్రెస్సింగ్ టేబుల్‌మీద దుమ్ముదులపడం, ఆయన రుమాళ్లో చొక్కాలో నా జాకట్లో ఇస్త్రీ చెయ్యటం, చాకలి బట్టలు తేస్తే పద్దు చూసుకోవటం, దుప్పట్లూ గలేబులూ మార్చటం, వంట, భోజనం, పడక, పాలవాడు, పనిమనిషి, అంట్లు, జిడ్డు, కొలీగ్స్, పాత స్నేహితులూ, కాఫీలూ, కూల్‌డ్రింకులూ, పత్రికలూ, పుస్తకాలు, రేడియో - ఇన్నిటి మధ్యా ఏదో అసంతృప్తి. ఆయన కోరుకున్న విధంగా అన్నీ అమరుతున్నాయి. ఆయన క్కావలసినవన్నీ జరుగుతున్నాయి. ఆయన కెంతో తృప్తిగా ఉన్నట్లే కన్పిస్తున్నారు.

నాకు మాత్రం ఇంకా అసంతృప్తి. వర్కింగ్ డేస్‌లో నిత్య కార్యక్రమం. ఆదివారం వస్తూందంటే భయం. ఆయన స్నేహితులెవరో వస్తారు. ఒక్కొక్కప్పుడు భార్యలతో సహా. అందులో నాకు ఈడూ జోడూగా ఉన్న వాళ్ళుగాని అభిరుచులు కలిసినవాళ్ళు గాని లేరు. కేవలం ఆయన్ని సంతృప్తి పరచటం కోసం వాళ్ళతో కలిసి మెలిసి ఉండటానికి ప్రయత్నిస్తాను.

ఆయన కొలీగ్స్‌లో ఒకతను ఉన్నాడు. ఇంచుమించు నా యీడే. చాలా చురుగ్గా సరదాగా మాట్లాడతాడు. ఓసారి మేము భోజనానికి కూర్చోబోతూంటే వచ్చాడు. అతన్నీ కూర్చోమన్నారు. మొహమాట పడుతూనే తిన్నాడు. నేను చేసిన ప్రతి వంటకాన్నీ తెగమెచ్చుకున్నాడు. హోటల్ తిండి తిని ఉండటం మీదట ఇన్నాళ్ళకి మళ్ళీ వాళ్ల అమ్మ చేతి వంట తింటున్నట్లుగా ఉందన్నాడు. నా మనస్సు నెమలిలా పురివిప్పుకుంది. అతనంటే చెప్పలేనంత అభిమానం ఏర్పడిపోయింది. కానీ ఆయనకి అతనంటే చిరాకు. ఆఫీసులో కష్టపడి పని చెయ్యడుట. కబుర్లతో కాలక్షేపం చేస్తాడుట. ఏ టెన్నిస్ మాచ్ చూడాలనో ఏదో వంకపెట్టి షార్ట్‌లీవ్ తీసుకుంటూ ఉంటాడుట. అంచేత ఆయన కిష్టంలేదని అతనితో ముభావంగా ఉండటం అలవరచుకున్నాను. మా ఇద్దరి మధ్య ఇలాంటి ఇష్టాయిష్టాల సంఘర్షణ నా మనస్సుని మరింత దొలచటం మొదలుపెట్టింది. నాలోని అసంతృప్తి అంతకంతకు పెరిగిపోతోంది.

ఓరోజు మరింత చిరాకువేసి 'మా ఊరు వెడతాను ఓసారి' అన్నాను భోంచేస్తున్న సమయంలో.

'ఎప్పుడు వెడతావ్' అన్నారు వెంటనే.

నేను ఆశించిన మాటలు అవికావు. 'ఇప్పుడెందుకు వెళ్ళొద్దు - నాకు తోచదు నువ్వెడితే - ఈసారి నాకు సెలవు దొరికినప్పుడు ఇద్దరం కలిసి వెడదాంలే' అంటారేమోననీ, నా ఒంటరితనాన్నీ అసంతృప్తినీ గ్రహించి నన్ను సముదాయించటానికి ప్రయత్నిస్తారనీ

అనుకున్నాను. కానీ అంత వెంటనే 'ఎప్పుడు వెడతావ్' అనేసరికి ఒళ్ళు మండింది.

'ఏం, అంత తొందరపడుతున్నారు? నేనుపోతే హాయిగా ఉందామనా?' అన్నాను.

'ఏం, నేను హాయిగా ఉండటం నీ కిష్టం లేదా?' అని ఎదురు ప్రశ్న వేశారు ఠక్కున.

ఆయన తికమక సంభాషణకి నవ్వొచ్చింది. చిరునవ్వు దాచుకోలేక పోయాను. అది ఆయన పసిగట్టి వెంటనే నా చెవి మెలిపెట్టారు నవ్వుతూ. నెప్పిపెట్టినా ఆ మాత్రం చిలిపి సరసానికే నా హృదయం గంతులు వేసింది. ఆయన ఎప్పుడూ ఇలా ఎందుకుండకూడదూ? మళ్ళీ ప్రయాణం సంగతి తలపెట్టలేదు నేను.

ఆయన మంచి మూడ్‌లో ఉన్నారు కదా అని ఈసారి ఏమైనా సరే ఆదివారం నాడు సినిమాకి ఆయన్ని లాక్కుపోవాలనుకున్నాను. మధ్యాహ్నం పనిమనిషి వస్తే దాని కొడుకు చేత ప్లాజాలో సినిమాకి టిక్కెట్లు తెప్పించిపెట్టమని డబ్బులిచ్చాను. శనివారందాకా ఆ ప్రసక్తి తీసుకురాలేదు. ఆదివారం వచ్చింది. మామూలు ప్రకారం బద్ధకంగా ఎనిమిదింటి వరకూ లేవలేదాయన. నేను చడీచప్పుడు కాకుండా రెండు పూట్లకీ సరిపడ వంటచేసేశాను. భోజనాలయాక వక్కనములుతూ భుక్తాయాసం తీర్చుకుంటున్నారాయన. పైకి మెచ్చుకోకపోయినా నేను చేసిన సాంబారూ, వంకాయ అల్లంపెట్టిన కూరతో ఎంతో తృప్తిగా తిన్నారు. మెల్లిగా నేనూ పక్కమీదికి చేరాను. ఆయన గుండెల మీద మునివేళ్లతో నిమురుతూ 'ఇవాళ పిక్చర్‌కి పోదామండీ' అని సాగదీశాను.

'ఆదివారం అప్పటికప్పుడు వెళితే టిక్కెట్లు దొరకవని చెప్పలే? ఇది మీ అమ్మమ్మగారి ఊరు అనుకున్నావేమిటి?' అన్నారు నా కోరికని చాలా తేలిగ్గా కొట్టిపారేస్తూ.

'మీరలా తప్పించుకుంటారని తెలుసు. అందుకే చూడండి ఏం చేశానో -' అని పరుపుకింద దాచిన సినిమాటిక్కెట్లు తీసి చూపించాను గర్వంగా. ఆయన వెంటనే నల్లి కుట్టినట్లు లేచి నిటారుగా కూర్చున్నారు.

'ఎందుకిలా అడుగడుక్కీ నన్ను హింసించటానికి ప్రయత్నిస్తావ్? మూడు గంటల సేపు కూర్చుని నేనా వెధవ సినిమాలు భరించలేను' అన్నారు కటువుగా.

అక్కడికీ ఆయన్ని మెత్తబరచాలని 'ఒక్కసారి సరదాగా వెళ్ళి రావటానికి అంత అయిష్టతేమిటి మీకు?' అన్నాను వీలైనంత మృదువుగా.

'అసలే నాకు సినిమా అంటే పడదు - అందులోనూ ఆ వెధవ హిందీ సినిమాకి - నేను ఛస్తే రాను.'

'నా కోసం - ఈ ఒక్కసారికీ - ' అన్నాను దీనంగా మొహం పెట్టి.

'నీ కంతగా చూడాలని ఉంటే ఆ పక్కింటావిడతోనో ఇంకే ఫ్రెండ్స్‌తోనైనా వెళ్లు. నేమాత్రం రాను' అన్నారు ఖచ్చితంగా.

'బావుంది! పక్కింటావిడకి మొగుడు లేడనుకున్నారా? ఆవిడ మొగుడితో కలిసి వెడుతుంది. నాకింక ఫ్రెండ్సెవరున్నారిక్కడ?'

'అదేవచ్చింది. ఎవ్వరితోను స్నేహం చెయ్యవు. గుళ్లో విగ్రహంలా కూర్చుని ఇరవై నాలుగ్గంటలూ నీ కొంగుకి నన్ను ముడేసుక్కూర్చోవాలని చూస్తావు?'

'మిమ్మల్ని నా కొంగుకి ముడేసుకోగల దాన్నైతే మీ చుట్టూ ఉపగ్రహంలా ఎందుకు తిరుగుతాను? మీ సాన్నిధ్యంలో ఏదో ఒరిగి పోతుందని పెళ్ళి చేసుకొని నా స్నేహితులందర్నీ దూరం చేసుకున్నాను. ఈ ఊళ్ళో ఎవరున్నారు నాకు - మీరూ మీ కొలీగ్స్ భార్యలూ తప్ప. వాళ్ళనే నా స్నేహితులనుకోవాలి నచ్చినా నచ్చకపోయినా. మీకే నా సాహచర్యం గిట్టనప్పుడు..' ఇహ నా గొంతు పూడుకుపోయింది.

'అయినా చదువుకున్నదానివి - ఇంత సినిమాల పిచ్చి ఏమిటి?' అన్నారు కాస్సేపుండి.

'ఒక్కసారి సినిమాకి వెడదామంటే అది పిచ్చికింద జమా? మొదటి సారి అడిగినప్పుడే మీరు ఒప్పుకుంటే ఇంత పదే పదే ప్రాధేయపడాల్సిన ఖర్మేంపట్టేది? అయినా రోజూ ఇంట్లో కూర్చుంటే ఏం తోస్తుంది? ఎప్పుడైనా కాస్త సరదాకోసం తహతహలాడ్డం తప్పా?

'తోచక పోవటమేమిటి? ఇంటినిండా పత్రికలూ, పుస్తకాలూ, రేడియో -ఇన్ని ఉండగా. నీ స్నేహితులికి ఉత్తరాలు రాసుకోలేవూ?'

నా స్నేహితులికి ఉత్తరాలు! ఏమని రాయను? ఇవాళ వంకాయ కూర చేశాను. మా ఆయన ఆఫీసునుంచి ఇంకా రాలేదు. నిన్న పని మనిషి రాకపోతే అంట్లు నేనే తోముకున్నాను అనా?' అంటూ అరిచాను.

'ఏదో తోచటం లేదంటే ఉత్తరాలు రాసుకోకూడదా అని సలహా అంటే ఇవ్వగలను గాని, నువ్వేం రాయాలో డిక్టేట్ చెయ్యమంటే మాత్రం నావల్ల కాదుస్మీ' అన్నారు సందర్భం మార్చేస్తూ.

'నంగనాచిలా మాట్లాడకండి' అన్నాను బుసలుకొడుతూ.

'అదీ! ఇంట్లో లేనంతసేపూ మీకోసమే తపించిపోతున్నానంటూ నాటకం! ఇంట్లో ఉంటే ఏదో ఒక రభస! ఇలాంటి వాళ్ళు తాము సుఖంగా ఉండలేరు, ఎదుటి వాళ్ళని ఉండనివ్వలేరు. ఆదివారం పూటా సరదాగా కాస్సేపు కబుర్లు చెప్పుకోవటానిక్కూడా లేదు' అంటూ ఎదురు తిరిగారాయన.

'నాతో చెప్పటానికి కబుర్లేముంటాయి! ఆ స్నేహితులొస్తే మాత్రం గంటలికి గంటలు తెలిసిరావు.- పక్కింటావిడ గురించి చెబితే, అబ్బ! వాళ్ళ గొడవ మనకెందుకులెద్దూ అంటారు. పనిమనిషి గురించి మాట్లాడితే 'మన మధ్యన ఆ పనిమనిషిని తెస్తావెందుకూ?' అంటారు. ఇంకేం మాట్లాడను ఇంట్లో కూర్చునేదాన్ని? మీలా ఉద్యోగం చేస్తూంటే నా ఆఫీసు గొడవలు నేనూ చెప్పేదాన్ని. నా ఆఫీసు ఫ్రెండ్స్ నాకూ ఉండేవారు. ఇలా మిమ్మల్ని పట్టుకు పాకులాడవలసిన అగత్యంగాని మీ చుట్టూ తిరగాల్సిన ఖర్మగాని ఉండేవి కావు' అన్నాను ఉద్రేకంగా.

'అవును, నువ్వూ ఏదన్నా ఉద్యోగం ఎందుకు చెయ్యకూడదు? ఈ 'తోచక పోవటం' జబ్బుపోతుంది' అన్నారు - బ్రహ్మాండమయిన పరిష్కారం తట్టినట్లు.

'అవును, హాయిగా ఏదన్నా ఉద్యోగంలో చేరతాను' అన్నాను ధైర్యంగా నిలబడి.

ఆయన న్యూస్ పేపరు తీసుకుని ప్రకటనలు చూడటం మొదలు పెట్టారు తీక్షణంగా మొహం పెట్టి.

'పోనీ, ఇవ్వాళ ఒక్కరోజుకి రండి. టిక్కెట్లు వృధా అయిపోతాయి' అన్నాను ఆత్మగౌరవాన్ని చంపుకుని.

'కావలిస్తే నువ్వొక్కర్తివీ వెళ్లు. నాకభ్యంతరం లేదు' అన్నారు తల యెత్తకుండానే. టిక్కెట్లని పర్రుమని చింపేశాను.

**శ్రీమతులు - సెప్టెంబరు '69**